# వేలును వెదురుగా... ఈలను వంశీరవంగా మలచిన మహా నటగాయకుడి చరిత్ర




వివిధ రంగాల్లో జాతి గర్వించగ్గ ఆణిముత్యాలు తెలుగువారిలో ఉన్నారు. ముఖ్యంగా సంగీత, సాహిత్య, నాటక, సినిమా రంగాల్లో తెలుగు గౌరవ పతాకాన్ని రెపరెపలాడించిన మహనీయులు ఎందరో! తమ ప్రతిభా పాటవాలతో, కళావైదుష్యంతో తెలుగువారి కీర్తిని నిలబెట్టిన నాటి తరాల గురించి ఈ తరానికీ, భావి తరాలకు తెలియజేయాలి. అందుకు చరిత్రను పరిశోధించి, వివరాలు సేకరించి, పుస్తక రూపంలో వెలువరించాలి. ఈ దిశగా సాగుతున్న క్రియేటివ్ లింక్స్ ఇటీవల వెలువరించిన పుస్తకం ఇది. తెలుగు పాటను పద్యాన్ని హిందుస్థానీ, కర్ణాటక రాగాల మేళవింపుతో రంజింపజేసిన ఈలపాట రఘురామయ్య జీవితానికి ఇది వివరణాత్మక చిత్రణ. ప్రముఖ రంగస్థల పరిశోధకులు, బహు గ్రంథకర్త ఆచార్య మొదిలి నాగభూషణ శర్మ దీన్ని రాశారు. రఘురామయ్య కుటుంబ సభ్యులు, ఆయన అమరగానంలాగే అందంగా వెలువరించిన ఈ పుస్తకం ఒకవైపు రఘురామయ్యగారి నటప్రస్థానం గురించి చెబుతూనే, ఆయనతో పాటు తెలుగునాటక రంగం ఎదిగిన వైనాన్ని అంతర్లీనంగా, అత్యంత ప్రామాణికంగా వివరించింది. గుంటూరు జిల్లాలోని సుద్దపల్లి అనే మారుమూల గ్రామంలో రైతు కుటుంబంలో వెంకట సుబ్బయ్య పేరుతో జన్మించి, కాశీనాథుని నాగేశ్వరరావు ఆశిస్సులతో రఘురామయ్యగా ప్రాచుర్యం గడించి, అత్యున్నత స్థాయికి సాగిన ఓ మహా కళాకారుడి కథ ఓ సినిమా కథలాగే అనిపిస్తుంది. అందమైన ముఖచిత్రంలో పాటు అరుదైన ఛాయాచిత్రాలతో లోపలి పేజీలను అలరించిన తీరు ప్రశంసనీయం. రఘురామయ్య నాటక పాత్రలతో పాటు ఆయన నటించిన చిత్రాల వివరాలను కూడా చేర్చడం వలన పుస్తకం సమగ్రంగా రూపొందింది. గ్రంథకర్త అభినందనీయులు. తెలుగు నాటక, సినిమా అభిమానులు తప్పకుండా చదివి, భద్రపరచుకోవాల్సిన పుస్తకం. మలి విడతలో అచ్చుతప్పులను సరిచేస్తే పుస్తకం మరింతగా శోభిస్తుంది.



**– ఓలేటి శ్రీనివాసభాను**

*(ప్రఖ్యాత రంగస్థల, చలన చిత్ర నటుడు పద్మశ్రీ ఈలపాట కల్యాణం రఘురామయ్య నటజీవితం-రచన: ఆచార్య మొదలి నాగభూషణశర్మ, పేజీలు: 150, ధర రూ.250 (పాటల సీడీ ఉచితం), ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలూ)*